మెడికల్ రంగంలో బకాయి వేతనాలు చెల్లించాలి

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నరసింహ

హిమాయత్‌నగర్, మార్చి 8: మెడికల్ రంగంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విభాగాల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే 17 వేల మంది ఉద్యోగులకు మూడు నెలలుగా బకాయి ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నరసింహ డిమాండ్ చేశారు. హిమాయత్ నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌హెచ్‌ఎం స్కీం కార్మికులకు జీతాలు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు సీఎం రేవంత్‌రెడ్డి లేఖ రాశారని ఆయనపై బీజేపీ నాయకులు విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురాలేని బీజేపీ నాయకులు ఎదురు దాడికి దిగడం సిగ్గుచేటు అని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జీతాలు అందకపోవడంతో ఉద్యోగుల కుటుంబ పోషణ భారం అవుతుందని, కేంద్రం నుంచి నిధులు రావడంలేదనే సాకుతో ఉద్యోగులకు జీతాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వాలు తక్షణమే స్పందించి వేతనాలు చెల్లించాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

టెక్ మహీంద్రా స్మార్ట్‌లో జాబ్ మేళా

నిరుద్యోగులను ఇంటర్వ్యూ చేస్తున్న హెచ్ఆర్ విభాగం ప్రతినిధులు

బన్సీలాల్‌పేట్, మార్చి 8: అప్సా, టెక్ మహీంద్రా ఫౌండేషన్ స్మార్ట్ కేంద్రంలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. ఇందులో జస్ట్ డయల్, కార్పొన్ సొల్యూషన్స్, స్టైడ్ కన్సల్టింగ్ సంస్థలు నిరుద్యోగులను ఇంటర్వ్యూ చేసి, ప్రాథమికంగా పది మందిని ఎంపిక చేశారని, స్మార్ట్ శిక్షణా కేంద్రం మేనేజర్ షేక్ మౌలానా అన్నారు. బస్తీలలో నివసించే పేద, మధ్య తరగతికి చెందిన పదో తరగతి పాసై, ఇంటర్, డిగ్రి పాస్ లేదా ఫెయిల్ అయిన 19 నుంచి 27 ఏండ్లున్న యువకులకు చేయూతను ఇస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు మూడు నెలల పాటు కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్, టైపింగ్, ఇంటర్నెట్, రిటైల్ రంగాలలో ఉచిత శిక్షణ అందించి, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నామని తెలిపారు. త్వరలో ప్రారంభమయ్యే నూతన బ్యాచ్‌లలో చేరడానికి ఆసక్తి ఉన్న అభ్యర్థులు సెల్ నం.84980 89786లో సంప్రదించాలని ఆయన కోరారు. గాంధీ దవాఖాన ఎదురుగా యాక్సిస్ బ్యాంక్ సమీపంలో ఎవర్‌గ్రీన్ కమ్యూనిటీ హాలులో తమ శిక్షణా కేంద్రానికి నేరుగా వచ్చి కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

- మహిళల రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర
- ప్రభుత్వాలు మారినంత మాత్రాన ప్రజల హక్కులు కాలరాస్తారా?
- కుట్ర పూరితంగా తీసుకువచ్చిన జీవో నం.3ను వెంటనే రద్దు చేయాలి
- 90 రోజుల్లో సోనియా, రాహుల్ గాంధీల వద్ద హాజరేసుకోవడం తప్ప సీఎం రేవంత్ చేసిందేమిటి?
- కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా వ్యతిరేక విధానాలతో ముందుకెళ్తుంది

విద్యా ఉద్యోగాల్లో 33 శాతం ఎక్కడా?

ధర్నాకు హాజరైన ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, మాగంటి గోపీనాథ్ ■ భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

కవాడిగూడ, మార్చి 8: రాష్ట్రంలో మహిళల విద్యా ఉద్యోగాలకు సంబంధించి 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కుట్ర పూరితంగా తీసుకువచ్చిన జీవో నం.3ను వెంటనే రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఇందిరా పార్కు ధర్నా చౌక్‌లో భారత జాగృతి ఆధ్వర్యంలో ఉద్యోగ నియామకాలలో అన్యాయం చేసే జీవో నం.3ను రద్దు చేసి మహిళలకు ఉద్యోగాలలో 33 శాతం వాటా కల్పించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ, ప్రభుత్వాలు మారినంత మాత్రాన ప్రజల హక్కులు కాలరాయొద్దని అన్నారు. మహిళల ఉద్యోగ నియామకాలలో బీహార్, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీవో నం.3ను రద్దు చేసి మహిళలకు ఉద్యోగాలలో 33 శాతం రిజర్వేషన్లను అమలు చేసి న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. వ్యక్తిగత కారణాలతో చనిపోయిన అమ్మాయిల చావులను కూడా రాజకీయం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ జీవో నం.3 ద్వారా మహిళలకు తీవ్ర అన్యాయం చేస్తున్నదని ఆమె మండిపడ్డారు. సోనియా గాంధీ, ప్రియాంక గాంధీలు పార్లమెంట్‌కు వెళ్లాలి. కాని, తెలంగాణ ఆడబిడ్డలు మాత్రం ఉద్యోగాలు రాకుండా ఇంట్లోనే ఉండిపోవాలా? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజునే మహిళా

హక్కుల కోసం రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేయడం దౌర్భాగ్యమని అన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లో ఢిల్లీకి వెళ్లి సోనియాగాంధీ, రాహుల్ గాంధీ వద్ద హాజరు వేసుకోవడం తప్ప సీఎం రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఓటుకు నోటు కేసు మీద ఉన్న మహిళల హక్కులు, ఉద్యోగాల నియామకాలలో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసే విషయంలో శ్రద్ధ లేదని ఆమె మండిపడ్డారు. మాయ మాటలు, అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి మాకు ఒక్క శాతం ఓట్ల తేడా మాత్రమే ఉందన్నారు. డిసెంబర్ 9న అన్ని గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి అమలు చేయకుండా తప్పించుకుంటున్నారని అన్నారు. ఏది అడిగినా వంద రోజులు ఆగమంటున్నారని, ఇంకా పది రోజుల సమయం ఉందని, ఆ తరువాత కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయకుంటే నిలదీస్తామని ఆమె హెచ్చరించారు. జీవో నం.3 వల్ల గురుకులాల్లో కేవలం 12 శాతం రిజర్వేషన్లు మాత్రమే అమలు జరిగినట్లు తెలిపారు. మహిళలను ప్రోత్సహిస్తే అద్భుతాలు జరుగుతాయని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా వ్యతిరేక విధానాలతో ముందుకు వెళుతుందని, మహిళలకు న్యాయం చేయాలని చిత్త శుద్ధి ఉంటే జీవో నం.3పై హైకోర్టులో పిటిషన్ వేయాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళా హక్కుల కోసం చట్టాలు రూపకల్పన చేయాలని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వల్ల అనేక హక్కులు వచ్చాయన్నారు. 1996లో విద్యలో 33 శాతం మహిళలకు వాటా కల్పించారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కేసీఆర్ పోలీస్ శాఖలో, మార్కెట్ కమిటీలో మహిళలకు వాటా కల్పించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఓయూలో 72 శాతం అమ్మాయిలే కేసీఆర్ లక్షా అరవై వేల ఉద్యోగాలతో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసి అవకాశం కల్పించారన్నారు. పాత ప్రభుత్వంలో తప్పులు దొర్లితే సరిదిద్దాలని, రాజస్థాన్ కోర్టు తీర్పును కేసీఆర్ వ్యతిరేకించి హైకోర్టును ఆశ్రయించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి సీఎం అయిన తరువాత ఆడ పిల్లల శవాల మీద పేలాలు ఏరుకుంటున్నారని ఆరోపించారు. విద్యార్థులకు అండగా నిలవాల్సిన రేవంత్ రెడ్డి కోర్టులో కేసును ఉపసంహరించుకోవడం దారుణమన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ప్రజా వాణి కాదు ఢిల్లీ వాణి మాత్రమే వినిపిస్తాయన్నారు. పీహెచ్‌సీ వాళ్లకు కూడా రిజర్వేషన్లు కల్పించడం లేదని, వారు కూడా ఈ పోరాటంలో ఐక్యంగా ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. ధర్నా కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, మాగంటి గోపీనాథ్, మాజీ చైర్మన్లు గజ్జెల నాగేష్, మేడి రాజీవ్ సాగర్, దేవీ ప్రసాద్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్ రెడ్డి, యునైటెడ్ పూలే ఫ్రంట్ కన్వీనర్ గుట్ట రాంచందర్, ఓయూ జేఏసీ నేత దత్తాత్రేయ, వివిధ సంఘాల నాయకులు సత్యం, గౌతం ప్రసాద్, సుమిత్ర, బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహా, కల్వ గోపీ, ముచ్చకుర్తి ప్రభాకర్, వల్లాల శ్యామ్ యాదవ్, ఆర్.రాజేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లేచింది మహిళా లోకం.. పాట నేడు నిజమైంది

స్పీకర్ గడ్డం ప్రసాదరావు

వివిధ రంగాలలో రాణిస్తున్న మహిళలకు అవార్డులు అందిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాదరావు, రాచకొండ సీపీ తరుణ్ జోషి తదితరులు

బంజారాహిల్స్, మార్చి 8: యాభయ్యేళ్ళ క్రితం వచ్చిన గుండమ్మ కథ సినిమాలో 'లేచింది మహిళా లోకం.. నిద్ర లేచింది మహిళా లోకం' అని వచ్చిన పాట నేడు వాస్తవ రూపం దాల్చిందని, అన్ని రంగాలలో పురుషులతో సమానంగా స్త్రీలు రాణిస్తున్నారని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాదరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా ఎన్ఎస్ఐ గ్లోబల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన 55 మంది మహిళలకు 'మహిళా స్ఫూర్తి గౌరవం' అవార్డులు అందజేశారు. బంజారాహిల్స్‌లోని తాజ్ దక్కన్‌లో ఏర్పాటు చేసిన అవార్డు ప్రదానం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పురుషులతో సమానంగా నేడు మహిళలు దేశాన్ని ఏలుతున్నారన్నారు. మన దేశంలో మహిళలకు ప్రస్తుతం గౌరవం లభిస్తున్నదన్నారు. మహిళా నేతలైన కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్, సుష్మా స్వరాజ్ తదితరుల చొరవతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు సాకారమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా అభివృద్ధికి కృషి చేస్తున్నదని, మహిళా పారిశ్రామిక విధులకు సహకారం అందిస్తున్నదన్నారు. ఈ సందర్భంగా రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి మాట్లాడుతూ, వివిధ రంగాలలో మహిళలను గుర్తించి అవార్డులు ఇవ్వడం సంతోషకరమన్నారు. తన జీవితంలో అమ్మపాత్ర గొప్పవని గుర్తు చేసుకున్నారు. పోలీస్ శాఖలో సైతం ఇటీవల కాలంలో మహిళా అధికారులు పెరుగుతున్నారని.. ఎన్నో సవాళ్ళతో కూడుకున్న రంగమైనా పురుష అధికారులతో సమానంగా మహిళా అధికారిణులు విధి నిర్వహణలో మందంజలో ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ గ్లోబల్ కౌన్సిల్ అధినేత నవాబ్ షేక్ ఇబ్రహీం, అజయ్ మిశ్రా, అద్దంకి దయాకర్, సందీప్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిన్ ట్యూమర్ చికిత్సలో అపోలో ముందడుగు



జూబ్లీహిల్స్, మార్చి 8: బ్రెయిన్ ట్యూమర్ చికిత్సలో విప్లవాత్మక పురోగతిని సాధించే దిశగా అపోలో హాస్పిటల్స్ గ్రూప్ మరో అడుగు ముందుకేసింది. అపోలో హాస్పిటల్స్‌లో జెడ్ఏపీ-ఎక్స్ సేవలను అందుబాటులోకి తెచ్చారు. ఈ సంచలనాత్మక సాంకేతికతతో జెడ్ఏపీ-ఎక్స్ గైరోస్కోపిక్ రేడియో సర్జరీ ప్లాట్‌ఫామ్‌ను శుక్రవారం ఆవిష్కరించి దక్షిణాసియాలోనే మొట్టమొదటి మైలు రాయిని చేరుకుంది. బ్రెయిన్ ట్యూమర్ చికిత్సలో కేవలం 30 నిముషాల పాటు సెషన్లతో నాన్ ఇన్వేసివ్ విధానంతో శరీరంలోకి ఏ పరికరం ప్రవేశపెట్టకుండా, రోగికి ఎలాంటి బాధ కలుగకుండా అధునాతన వైద్యాన్ని అందించనున్నట్లు అపోలో హాస్పిటల్స్ గ్రూప్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ ప్రతాప్ చంద్రారెడ్డి వెల్లడించారు. జాప్ సర్జికల్ వ్యవస్థాపకుడు, సీఈఓ న్యూరో సర్జరీ ప్రొఫెసర్ జాన్ ఆర్ అడ్లెర్‌తో కలిసి జెడ్ఏపీ-ఎక్స్ సేవలను ప్రారంభించారు.

టెట్ వేయాలని.. 11న ఛలో హైదరాబాద్

- టీచర్ పోస్టులను పెంచాలి
- డీఎస్సీతో పాటు టెట్ నిర్వహించాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య

సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్, మార్చి 8: డీఎస్సీతో పాటు టెట్ వేసి, టీచర్ పోస్టులు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11న ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య తెలిపారు. డీఎస్సీతో పాటు టెట్ నిర్వహించడం అనవాయితీ అని, పక్క రాష్ట్రాలలో టెట్ వేసి విషయం ప్రభుత్వం గమనించి వెంటనే చర్యలు చేపట్టాని డిమాండ్ చేశారు. విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీలం వెంకటేశ్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా కృష్ణయ్య పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ టెట్ రాసి ఉత్తీర్ణత సాధించకుండా టీచర్ పోస్టు రాయడానికి అర్హత లేదని, నిరుద్యోగల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని టెట్ నిర్వహించాలని కోరారు. నిరుద్యోగుల వయో పరిమితిని రెండేండ్లు పెంచడంతో ఎంతో మంది నిరుద్యోగుల జీవితాల్లో ఆశలు చిగురించాయన్నారు. అలాంటి వారికి డీఎస్సీ రాసుకునే అర్హత కల్పించకపోవడం, వయో పరిమితి పెంచి ఉపయోగం ఏంటని? ఒకసారి సీఎం రేవంత్ రెడ్డి ఆలోచించాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో టెట్ డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఒకేసారి వేయడానికి ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరాలు ఏమిటని ఆయన ప్రశ్నించారు. టెట్ నిర్వహించి ఆరు నెలలు అవుతుందని, అందులో పది శాతం మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారని, ఈ నేపథ్యంలో మరోమారు టెట్ నిర్వహించాలని కోరారు. డీఎస్సీ పరీక్ష నిర్వహణకు టెట్ నిర్వహణకు మధ్య మూడు నెలల వ్యవధి ఉన్నదన్నారు. గతంలో పోస్టులు తక్కువగా ఉండటం, సిలబస్ మారడం వల్ల చాలా మంది అర్హత సాధించలేకపోయారని అన్నారు. బీఈడీ, డీఈడీ పాసైన నిరుద్యోగులు టెట్ వేయకపోవడంతో తీవ్ర సంతృప్తితో ఉన్నారని, ఒక అవకాశం కోల్పోతామనే ఆవేదన చెందుతున్న నేపథ్యంలో ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో 24 వేల టీచర్ పోస్టుల ఖాళీగా ఉంటే కేవలం 11 వేల పోస్టులు భర్తీ చేస్తామనడం సరికాదన్నారు. 24 వేల టీచర్ పోస్టుల భర్తీకి, టెట్ వేసి డీఎస్సీ నిర్వహించాలనే డిమాండ్‌తో 11న ఇందిరా పార్కు వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు.

అట్టహాసంగా యాదాద్రి అఖండ జ్యోతి ప్రారంభం

కాచిగూడ, మార్చి 8: తెలంగాణలోని ప్రధాన పుణ్య క్షేత్రాలను ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేస్తున్నదని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. మహా శిరాత్రి సందర్భంగా శుక్రవారం బర్కత్‌పుర యాదాద్రి భవన్ వద్ద శ్రీలక్ష్మీనరసింహాస్వామి అఖండ జ్యోతి యాత్రను ప్రభుత్వ విప్ ఐలయ్య, యాదాద్రి దేవాలయ ఈవో రామకృష్ణ, కాచిగూడ కార్పొరేటర్ ఉమా యాదవ్, దైవజ్ఞ శర్మ ప్రారంభించారు. శ్రీలక్ష్మీనరసింహాస్వామి దేవస్థానం సహకారంతో అఖండ జ్యోతి యాత్ర కమిటీ ఆధ్వర్యంలో శివరాత్రి పండుగను పురస్కరించుకుని 30 ఏండ్లుగా ఈ యాత్రను నిర్వహిస్తున్నది. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ, అఖండ జ్యోతి రథయాత్ర హిందూ మతానికి ప్రతీకగా నిలుస్తున్నదని, ప్రజల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందించడానికి రథయాత్ర ఎంతగానో దోహదపడుతున్నదని వెల్లడించారు. రానున్న రోజుల్లో తిరుపతి దేవాస్థానం లాగ తెలంగాణలోని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహాస్వామి దేవాలయం నిలువనుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యాదాద్రి అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తుందని తెలిపారు. ఈ అఖండ జ్యోతి రథయాత్ర ఎనిమిది నుంచి 11వ తేదీ వరకు యాదాద్రికి చేరుకుంటుందని కమిటీ చైర్మన్ సద్ది వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి ధర్మకర్త నర్సింహ మూర్తి, డాక్టర్ గౌతంరావు, కన్నె రమేశ్ యాదవ్, సూర్యప్రకాశ్ సింగ్, పవన్ కుమార్, శ్రీకాంత్, ఉపేందర్ రావు, భీంరాజ్, భక్తులు పాల్గొన్నారు.

అఖండ జ్యోతి రథయాత్రను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కార్పొరేటర్, తదితరులు

టీ పలు రకాలుగా చేయొచ్చని తెలుసుకున్నా: సుమయారెడ్డి

మాదాపూర్, మార్చ్ 8: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో హైబిజ్ టీవి ఆధ్వర్యంలో కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ, ఇన్‌క్రెడిబుల్ ఇండియా, తెలంగాణ టూరిజం సహకారంతో శుక్రవారం టీ ఛాంపియన్ షిప్-2024 కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఇందుకు ముఖ్య అతిథిగా నటి, నిర్మాత సుమయారెడ్డి విచ్చేసి శ్రీ చక్ర మిల్క్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పి. బ్రహ్మయ్య, క్రెడాయ్ నేషనల్ జనరల్ సెక్రటరీ జి.రాంరెడ్డితో పాటు హైబిజ్ టీవి మేనేజింగ్ డైరెక్టర్ రాజ్ గోపాల్, సీఈఓ జె. సంధ్యారాణిలతో కలిసి కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమయారెడ్డి మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి వచ్చాక టీ ని ఇన్ని రకాలుగా పెట్టొచ్చని తెలుసుకున్నానని, మహిళలు వారి అభిరుచులకు అనుగుణంగా టీ పెట్టేందుకు మహిళలు ఉత్సాహంగా పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఇందులో భాగంగా 150 మంది మహిళలు పాల్గొనగా 12 మంది ఫైనల్‌కు చేరుకున్నారు. ఎనిమిది మందిని విజేతలుగా నిర్ణయించి మొదటి బహుమతి కె.జ్యోత్స్న రూ.1 లక్ష గెలుపొందగా, రెండో బహుమతి కె.వరలక్ష్మి రూ.50 వేలు, పి.జ్యోత్స్న మూడో బహుమతి రూ.25 వేలు, మిగతా విజేతలకు రూ.10 వేల బహుమతిని అందజేశారు.

టీ ఛాంపియన్‌షిప్‌లో బహుమతులు గెలుచుకున్న పలువురు మహిళలు